కథా కౌముది

# కర్ణ 'భేరీ' డా.మూర్తి జొన్నలగెడ్డ

పేరు వినీ వినగానే పప్పులో కాలేసేశారు!

మహా భారతంలో కర్ణుడికీ, ఈ కథకీ ఏవీఁ సంబంధం లేదనే నా ప్రత్యాదేశాన్ని మీరు ఆమోదించీ, దించగానే చప్పున ముందుకెళ్ళిపోదాం.

ఇది నా కర్ణ సౌందర్యానికి అనగా, నా సొట్ట చెవుల వంపు సొంపులకూ, వాటి ద్వారా నాకు వచ్చిన కష్ట నష్టాల పురాణ భేరీ అన్న మాట! మరి ఏదో పురాణం అని ఎందుకు గొప్పలు పోతున్నాను? ఇది నా సొంత గొడవే అయినా, దీనిలో మానవాళి గ్రహించవలసిన గొప్ప నీతులు దాగి ఉన్న కారణం చేత, ఏ మాత్రం స్వార్థం లేకుండా మీ అందరికీ చెప్పేసుకుంటున్నానని మీరు చివర్లో వొప్పేసుకుని, సగౌరవంగా పురాణం హోదా ఖాయం చేసేస్తారని ప్రస్తుతానికి గట్టి నమ్మకంగా ఉంది.

అదిగో, అలా నా సామర్థ్యం మీద నాకు ఆ మాత్రం నమ్మకం ఆ రోజుల్లో కనక ఉండి ఉండుంటే, మనం ఈ రోజు, ఈ మంచి అవకాశాన్ని పోగొట్టుకుని ఉండేవాళ్ళం. చూశారా, మన పురాణాల్లో కూడా సరిగ్గా ఇల్లాగే ఎప్పుడో తరవాత జరిగబోయే సంఘటనలకి, ముందే నాంది పడిపోతూ ఉంటుంది.

సుమారు ఒక అర్ధ శతాబ్దం మునుపు మొదలైన వ్యవహారం (మరే, నిజవేఁ, అంత కాలం అయ్యింది!) "ఏది బాబూ, వో సారి ఇలారా!" అని ఇంటికి వచ్చిన అతిథులు ఎవరైనా, ఒక ఐదేళ్ళ కుర్రాణ్ణి పిలిచారనుకోండి, మీ లాంటి అమాయకులు, (అంటే, మంచివాళ్ళన్నమాట!) అదిగో, అలా తొందర పడి, కోప్పడిపోయే వాళ్ళు కాబట్టే మిమ్మల్ని అమాయకులన్నది. ఇలా చీటికీ మాటికీ మోకాళ్ళకి అడ్డం పడిపోతోంటే ఇంక ముందుకేం వెడతాం! పాపం పిల్లాడు కదా అని దగ్గరకు తీసి, ముద్దు చేసి, ముక్కు తుడిచి, ఏ మిఠాయో చేతిలో పెడతారు అని ఎంతో దయతో ఊహించేసుకుంటారు. కానీ నిజం నిష్ఠూరమైనది కదా! వాళ్ళు నన్ను దగ్గరకు తీసుకోవడం, మిఠాయి ఎక్కడనుంచి ఊడి

పడుతుందా అని నేను చూడడం వరకూ మీరు ఊహించినట్టే జరిగేది కానీ, వాళ్ళు వెంతనే "ఇదేవిటీ, ఈ చెవి ఇలా సొట్ట పోయింది?" అని, ఏదో ఆడుకుంటూ, బొమ్మలకి సొట్టలు పెట్టేసినట్టు గానే, నా చెవులకి కూడా సొట్టలు పెట్టేసుకుని తిరుగుతున్నాను అన్నట్టుగా నిలదీసేవారు.

ఆ సొట్ట ప్రశ్న వేసింది మొగుడు గారనుకోండి, అపుడు, వారి పాపాలన్నిటిలోనూ సగ భాగంగారైన వారి పెళ్ళాం గారు వారికి వత్తాసుగా, ముందుకి వొంగి, నా చెవి లాగి, ముందుకీ వెనక్కీ తిప్పి చూసి, (పాపం ఈ కుర్ర కుంకకి నెప్పెడుతుందేమో, లేపోతే భయపడతాడేమో అని కూడా లేకండా) కిష్టుడి నోట్లో లోకాలన్నీ చూసిన యశోదంత ఆశ్చర్య పడిపోయేహేసి "ఇదేవిఁటి పిన్ని గారూ, మీ వాడి చెవులకి కన్నాలున్నాయేవిఁటీ! వొక్కో చెవికీ మూడేసి సార్లు కుట్టించినట్టున్నారు?" అని ఆ మహా స్వాధిని (ఇంత పాడు లోకంలో వేరే ఇంకెవరుంటారు? మా అమ్మ గారే!) అడిగే వారు. సొట్టలైతే నేనే పెట్టేసుకోగలనేమో కానీ, కన్నాలు కొట్టుకోవడం నా వల్ల కాదని వారు ఒక నిర్ణయానికి వచ్చేశారని, అందువల్లే ఆ రెండవ ప్రశ్న మా అమ్మ గారిని అడిగారని మీరు గ్రహించేశారు కదా! అప్పుడు తన తరహాలో ప్రశాంతమైన చిరునవ్వు నవ్వి "అబ్బే, వాడికి పుట్టుకతోటే ఉన్నాయండీ! చంటి పిల్లాడికి అప్పుడే ఏం కుట్టిస్తాం" అనేవారు. "హ! హ!! కర్ణుడి కవచ కుండలాల్లాగన్న మాట" అని ఆ అతిధి మహాశయులలో ఎవరో ఒకరనేవారు. సాధారణంగా వాళ్ళ ఉత్సాహం అంతటితో చల్లారిపోయేది.

ఇక్కడ మీరు చొరవ చేసుకుని మరీ కలగజేసుకుని నన్ను క్షమించవలసిందిగా కోరుకుంటున్నాను. ఎందుకంటే, ఓం ప్రధమంగా ఒక ప్రత్యాదేశాన్ని ప్రతిపాదించానుగా, కర్ణుడికీ ఈ కధకీ ఏం సంబంధం లేదని. కానీ నా ప్రమేయం లేకుండా, ఆ వచ్చిన వాళ్ళు కర్ణుడికీ నాకూ ఇల్లాగ సాపత్యం తీసుకొచ్చేస్తారని ఎలాగ ఊహించగలను చెప్పండి? కొన్ని ఏళ్ళ తరబడి ఈ నాటకీయ సన్నివేశం, సంభాషణలో ఏ మాత్రం పొల్లు పోకుండా ఇలాఘే జరిగేది. నేను మాత్రం, ఇద్దరు ప్రపంచ ప్రఖ్యాత టెన్నీసు ఆటగాళ్ళు బంతి కింద పడకుండా ఆడుతూ ఉంటే, చూపరులు గుడ్లప్పగించి చూస్తున్నట్టు చూస్తూ ఉండిపోయేవాడిని. పెద్దల్ని తిట్టడం, తిట్టుకోవడం అలవాటు లేని తరం కాబట్టి, ఆ రెండూ చెయ్యకుండా, "మా అమ్మ గారు చేసి పెట్టే వేడి వేడి పలహారాలు లాగిస్తో, వరండా లోంచి చక్కటి మా పెరటి తోటని చూస్తో, ఇదేం చెట్టు? అదేం పువ్వు? అని అడగచ్చుగా", అప్పుడు చక్కగా నా తెలివి తేటలు ప్రదర్శించ గలిగే వాడిని అని అనుకునే వాణ్ణి. ఆ వచ్చిన వాళ్ళకి పిల్లలు ఉంటే, చిరుతిళ్ళు తినడం అవ్వగానే ఆటలకి పరుగెత్తేవాళ్ళం. మళ్ళీ వాళ్ళు వెళ్ళిపోయీ సమయంలో కేకేస్తే, ఆటలు ఆపి వచ్చే వాళ్ళం. అలాగ ఆ చెవి ధారా వాహిక సశేషం అయ్యేది.

వాళ్ళెవరికీ, మీలో చాలా మందికీ, ఆఖరికి నాకు కూడా వైద్య విద్య ఆరంభించే వరకూ తెలియని ఒక బ్రహ్మ రహస్యం ఏవిఁటంటే, శిశువు మాతృ గర్భంలో ఎదుగుతున్నప్పుడు, చెవి ఐదు విడి విడి భాగాలుగా ఉంటుందని, భూమ్మీద పడే సమయానికి అవన్నీ కలిసి మీ లాంటి వాళ్ళ అందమైన చెవిలా రూపు దిద్దుకుంటుందని. కాక పోతే నా లాంటి పురాణ పురుషులకి (అలా అనేసుకోవడంలో నా తప్పేమీ లేదు. చిన్నప్పట్నుంచీ, ప్రతీ వాళ్ళూ కవచ కుండలాలని

నన్ను రేపెట్టారు) ఆ ఐదు భాగాలూ కాస్త బద్ధకించి సరిగ్గా కలవక పోతే, మధ్యలో ఖాళీలు చెవి కుట్టించిన కన్నాల్లాగ కనిపిస్తాయన్న మాట. ఇది ఏవీఁ లెఖ్ఖల పాఠం కాదు, ఐదు భాగాల మధ్య నాలుగు ఖాళీలు ఉండాలి కదా అని నన్ను ఊదరగొట్టద్దు. అసలే చెవులు తిన్నగా లేక ఏడుస్తున్న పిల్లాణ్ణి. ఏం, అందులో రెండు భాగాలు మటుక్కు తిన్నగా కలిసిపోయి ఉండచ్చుగా!

సరే, సరే, అందరూ ఉండి, హడావుడిగా ఉన్నంత వరకూ పెద్ద ఇబ్బంది ఉండేది కాదు గానీ, ఎలాగైనా లేత వయస్సు, లేత మనస్సూ కదా, ఎవరైనా ఇంటికొస్తే ముద్దు చేస్తారనుకోవడం సహజం! అలాంటి వాళ్ళు "ఏవిటి నీ చెవులు సొట్ట చెవుల్లా ఉన్నాయ్?" అంటే పాపం బాధ పడ్డంలో వింత ఏముంది! వొఖ్ఖణ్ణీ మేడ మీదకి వెళ్ళి, నాన్న గారి పడగ్గదిలో కోడిగుడ్డు ఆకారపు అద్దం ముందు నించుని, రెండు చెవులూ రకరకాల కోణాల్లో చూసుకుని, హబ్బే! బొల్డు సొట్టలేవీఁ లేవు, ఒక చెవి పై అంచు మడత పడిందంతే అనుకుని, కాస్సేపు ఆ చెవి నెప్పెట్టే వరకూ చేత్తో వెనక్కి వంచి పట్టుకుని చూసుకుని సమాధాన పడేవాణ్ణి. కాగితం నలిపి ఆ మడతలో పెట్టుకుని పడుకుంటే కొన్నాళ్ళకి సరైపోతుందని అనుకుని, అలాగే చేసేవాణ్ణి. అది ఎప్పుడు పడిపోయేదో కానీ, పొద్దున్న లేచేసరికి కుక్క తోకలా వంకర యధాప్రకారం సిద్ధం!

కాస్త జుట్టు పెరిగితే చెవుల్ని కప్పేసి, పైన సొట్ట తెలీకుండా ఉండేది. అప్పుడు నాలో పురాణ పురుషుడు సమాధిలోకి వెళ్ళిపోయి వాడు. కాకపోతే మా నాన్న గారు క్రమశిక్షణకు పెట్టింది పేరు. ఎక్కడైనా, ఎవరైనా, వారి పేరు చెబితే, క్రమశిక్షణ ఉలిక్కిపడి, తనలోని అక్షరాలు క్రమంగా ఉన్నాయో లేవో అని ఒక సారి సరిచూసుకుని, ఠంచనుగా నిలబడేదన్న మాట! జుట్టు కాస్త పెరిగీ సరికి, ఆ విషయం గమనించి, మా అమ్మ గారితో "ఇదిగో, ఏమోయ్! వీళ్ళ జుట్లు పెరిగి రౌడీ వెధవాయిల్లా తయారయ్యారు. రేపు పొద్దున్నే ఆ సుభద్ర వాళ్ళ నాన్న,ని రమ్మని చెప్పమను" అనే వారు. ఆ విధంగా మా అన్నదమ్ములకి క్షవర కల్యాణం జరిగేది. మా ఇంటినీ, వెనక్కాల ఉన్న పెంకుటిల్లునీ కలిపే ఒక పొడుగాటి నడవలో ఒక స్తంభానికి ఆనుకుని కూర్చునేలా ఒక చెక్క పీట వేసి పని ప్రారంభించే వాడు మా ఆస్థాన క్షురకుడు.

సగం పని అవ్వగానే, నేను "మరీ అంత పలచగా చేసెయ్యద్దు, ఎండ చుర్రుమని పోతుంది" అని గుడ్లు మిటకరించుకుంటో విన్నవించుకునే వాణ్ణి. "అయ్ బాబోయ్! మరింకేవఁన్నా ఉందాండీ, చవరం కాడ ఏవైఁనా తేడా వొత్తేనండి, మిమ్మల్నీ నన్నూ కలిపి ఒక రేవెట్టేత్తారండి అయ్య గారు. కుతంత సేపు కదలకుండా కూసోండి, అయిపోద్ది" అని, సుభద్ర వాళ్ళ నాన్న, యధావిధిగా తన విధి నిర్వర్తించే వాడు. పని అవ్వగానే, నాన్న గారు యధాలాపంగా వచ్చి, క్షుణ్ణ పరిశీలన చేసి "ఏవిఁటయ్యా అది? అక్కడ చూడు, మెట్లు మెట్లు లాగ ఎలాఉందో! సాఫీగా కలుపు" అని హుకుం జారీ చేసి, లోపలకి వెళ్ళిపోయి వారు. దాంతో, అతను మళ్ళీ పని మొదలు పెట్టి, ఆ మిగిలిన జుట్టుని, నాకు ఏవైఁనా కాస్త ఆశలు మిగిలి ఉంటే వాటినీ కలిపి నున్నంగా క్షవరం చేసేవాడు. మా నాన్న గారు ఒక సారి గదమాయించాక, మళ్ళీ తిరిగి చూసుకోవక్కర్లేదని ఆ ప్రాణం లేని కత్తెరకు కూడా బాగా తెలుసు!

పొయ్యి మీద డేగిసాలో కాచిన నీళ్ళలో, నూతిలోంచి తోడిన నీళ్ళు తొరుపుకుని, కుంకుడుకాయ పులుసుతో తలంటుకుని మళ్ళీ నా చెవులతో మాట్లాడుకోడానికి, కోడిగుడ్డు అద్దం ముందు నించుని, "ఏవిటీ క్షవరం! శోభన్ బాబుకీ, నాగేస్రావుకీ వాళ్ళ నాన్నలు దెగ్గిరుండి క్షవరాలు చేయించరా? వాళ్ళనెవరూ రౌడీ వెధవాయిలు అనరే? వాళ్ళకీ చెవులు సొట్టలుంటే తెలిసీది" అనుకుంటో, ఈ లోకం సంగతులు పూర్తిగా తెలీని రోజుల్లో మధన పడేవాణ్ణి. అదేవిఁటో ఆ జుట్టు కూడా, మరీ క్రూరంగా, చాలా తాపీగా పెరిగేది.

చిన్న బడి లోను, ఇంచుమించు మన చుట్టాలు, పక్కాలు, బీరకాయి పీచు, అమాంబాపతు అందరిలోనూ, నేను పురాణ పురుషుణ్ణి అనే పరిస్థితి నెలకొంది. ఏదో, చెవులకి అర డజను కన్నాలున్నంత మాత్రాన్నేనా! అని మీరు అనుకోవచ్చు. సృష్టికర్త మరీ అంత హృదయం లేని వాడని మీరెలా అనుకుంటారు? సొట్ట చెవులతో బాటు, నాకు అదనపు ప్రత్యేక ఆకర్షణ ఏర్పాటు చేయబడింది. అది గమనించాలంటే నేను చొక్కా విప్పవలసి వచ్చేది. చొక్కా విప్పి వెనక్కి తిరగ్గానే, "వార్నీ! వీపు మీద కుడి వైపు ఆ చింత గింజంత పుట్టు మచ్చ చూడండి, ఎంటీ రామారావు లాగ!" అని ఆశ్చర్య పడిపోని వారు ఉండే వారు కారు. మన తెలుగు వారికి యంటీ రామారావు గారు, పురాణ పురుషుల్లోకే వస్తారని మీకు నేను చెప్పేదేముంది! పైగా, కాస్త జ్ఞాన సంపత్తి కలవారైతే, "మరే, అర్జునుడికి కూడా అక్కడే ఉండేదిట! అందుకే రామారావు గారు అంత గొప్పవాడయ్యాడు" అనే వారు. ముందు నుంచి చూస్తే కర్ణుడు, వెనకనుంచి చూస్తే అర్జునుడు అని ఎడా పెడా అందరూ అనేస్తోంటే సర్లే, ఒకదానికి ఒకటి సరి అనుకునే వాణ్ణి. ఎంతైనా, కర్ణుణ్ణి చాలా మంది, ప్రతి నాయకుడిగానే లెక్క వేస్తారుగా! వేర్వేరు కోణాలలో చూస్తే, ఇద్దరు ఏక గర్భ సంజాతులు స్ఫురణకు రావడం, సృష్టికర్త సరదాలలో ఒకటి కాక ఇంకేమిటి అనుకుంటాం! నేను సమ్మోహన వైద్య నిపుణుడిగా, తెలుగు ప్రాంతాల్లో పనిచేసినంత కాలం, శస్త్ర చికిత్స గదిలో ప్రవేశించే ముందు ప్రత్యేక దుస్తులు ధరించే సమయంలో కూడా, రామారావు గారు ప్రత్యక్షం అయ్యే వారు.

అదేవిఁటో విచిత్రం, నాకు పెద్దగా జ్ఞాన సంపత్తి, మహిమలూ ఏమీ లేక పోయినా, నా చెవి కన్నాలు, వీపు మీద పుట్టుమచ్చలు చూసిన జనం అందరూ, వారి అజ్ఞానం వల్లో, అభిమానం వల్లో నన్ను పురాణ పురుషుణ్ణి చేసేశారు. తరవాత్తరవాత తెలిసొచ్చింది, మన గొప్ప వాళ్ళల్లో ఇలాంటి బాపతు బాగానే ఉన్నారని! ఇంకా నయం, ఏదో తేడాగా కనుపిస్తున్నానని, రాళ్ళతో కొట్టి చంపెయ్య లేదు!

అయితే, అన్ని వందల మందిలో ఒక్కరన్న మాట మాత్రం నన్ను బాగా ఇబ్బంది పెట్టేది. ఒక సారి, వైద్య విద్యార్థి వసతి గృహంలో ఒకాయన, నేను స్నానానికి వెడుతోంటే నన్ను ఆపి, పుట్టు మచ్చ గురించి ముచ్చట పడ్డాడు. వెంఠనే ఇంకొకాయన "ఇలాంటి పుట్టుమచ్చలే, 'మెలనోమా' అనే ప్రమాదకరమైన క్యాన్సరు వ్యాధిలా మార్పు చెందుతాయి. ఆ తర్వాత లబోదిబో అన్నా ప్రయోజనం ఉండదు. బతికుంటే బలుసాకైనా తినచ్చు. నా మాట విని శస్త్ర చికిత్స చేయించుకుని, తీయించేసుకో!" అని సలహా ఇచ్చి వెళ్ళి పోయాడు. తిట్టుకుంటున్నానని ఏవీఁ అనుకోకండే మరి,

చిన్నప్పట్నుండీ అందరూ పురెక్కిస్తోంటే, హటాత్తుగా ఎవరో వచ్చి గాలి తీస్తే ఎలా ఉంటుంది? "నీ మొహమ్మండా! ఏవిఁ నోరురా బాబూ నీది. కాస్త నెమ్మదిగా ఆ విషయం ఎపుడో కాకతాళీయంగా చెబితే ఎలా ఉంటుంది? కాస్త శుభం పలికితే నీ సొమ్మేం పోతుంది, సామెతలు ఊరికే పుట్టవు!" అనుకుని చతికిలబడ్డాను. అప్పట్నుంచీ పుట్టుమచ్చ గురించి ఎవరు ముచ్చట పడినా, ముందు మురిసిపోయి, తర్వాత బెంగపడే వాణ్ణి.

మీలో ఎవరైనా తథాస్తు దేవతలుంటారా అని అనుమాన పడేవాళ్ళుంటే, ఇకపై ఆ సందేహమే అక్కర్లేదని మీ అంతట మీరే అంటారు. కారణం ఏవిఁటంటే, నలభయ్యో పడిలో పడ్డాక వో రోజు పుట్టుమచ్చ సలపడం మొదలెట్టింది. అది వాచి, ఎర్రగా అయ్యి చీము పట్టినట్టుగా ఉంది. ఆసుపత్రిలో వైద్యులు పరిశీలించి, మందులు వాడు, తగ్గుతుందేమో చూద్దాం అన్నారు. అలాగే తగ్గిపోయింది. అయినా ఏదో బెంగ! కొద్ది నెలలకి మళ్ళీ తిరగబెట్టింది. ఈ సారి "అబ్బాయ్, ఈ లక్షణాలు చూస్తోంటే ఇది 'మెలనోమా' గా మారుతోందేమోనని అనుమానంగా ఉంది. శస్త్ర చికిత్స చేసి తొలగంచేద్దాం" అన్నారు. మరింకేం చేస్తాం! బలుసాకు సామెత గుర్తుకొచ్చింది. బంగారం లాంటి పుట్టుమచ్చని తొలగిస్తోంటే, నా తలకాయే తీసేస్తున్నారనిపించింది! ఒక నలభై ఏళ్ళ పాటు, దాన్ని చూసిన ప్రతీ తెలుగు వాడూ, దానిగురించి మాట్లాడడమే! నాకు అంత పేరు తెచ్చి పెట్టిన, నా శరీరంలో ఒక భాగం, శాశ్వతంగా నా నుండి దూరం అవుతుంటే, మెదడు మొద్దుబారి పోయింది. ఎటువంటి స్పందనా లేని ఒక శూన్యం ఆవరించింది. తొలగించిన పుట్టుమచ్చను పరీక్షకి పంపారు. అదృష్ట వశాత్తు 'మెలనోమా' గా మార్పు చెందలేదని తేల్చి చెప్పారు. హమ్మయ్య అని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచి, కనీసం నా సొట్ట చెవులు నాకున్నాయి కదా అని, ఇంక ఆ ఆలోచనలను పక్కన పెట్టేశాను.

పుట్టు మచ్చ పరిమాణం, రంగు మారినా, దురద, మంట పెడుతోన్నా, అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని ముందే తెలుసనుకోండి. కాకపోతే, మనకేం కాదులే అనే అర్థంలేని ధీమా ప్రతీవాళ్ళకీ ఉంటుందిగా, నేనేమీ తక్కువ తిన్లేదు! గోటితో పోయీ దాన్ని గొడ్డలి దాకా తీసుకు వెళ్ళ కూడదుట. సర్లే, సలహా ఇచ్చి పడెయ్యడానికి వీడికేం పోయింది అని కొట్టి పారెయ్యకండి. ఎంటీ రామారావంత పేరు తెచ్చి పెట్టిన పుట్టుమచ్చ పోయి, వైద్యులు కోత పెట్టిన మచ్చ మిగల లేదూ!

మీ లాంటి సునిశిత పాఠకులు ఈ పాటికి ఒక విషయం గ్రహించే ఉంటారు. అదేవిఁటంటే, నేను చాలా సేపటి నుండి సొట్ట చెవుల గురించి మాటాడట్లేదని! సరే, సరే, అందరికీ అలవాటైపోయింది అన్నానుగా. కానీ, ఉన్నత పాఠశాలలో చేరేసరికి మళ్ళీ కొత్త వాళ్ళు చాలా మంది ఉంటారుగా, తిరిగి వాకబులు మొదలయ్యాయి. చాలా కాలం విరామం తర్వాత మళ్ళీ, చెవులతో మాట్లాడుకోవలసి వచ్చేది. చిన్న బడిలో నేనే అన్నిటిలోనూ ప్రథమంగా ఉండే వాడిని. నాకంటే ముందు, అన్నలందరూ చదివిన ఉన్నత పాఠశాలకే నేనూ వెళ్ళాను. వాళ్ళందరూ చదువుల్లో చాలా రాణించారు. ఉపాధ్యాయులందరూ నన్ను, నా పేరునీ చూడగానే "ఓహో! ఫలానా వారి అబ్బాయివా, మీ అన్నలందరూ చాలా బాగా చదివేవారు. ఇదేవిఁటీ, ఈ చెవి ఇలా సొట్టపోయింది?" అని అనడం పరిపాటైపోయింది. ఈ చెవుల గొడవతోనూ, వేర్వేరు

చిన్న బడుల నుండి తెలివైన విద్యార్థులు కొంత మంది రావడంతో, నా ప్రధమ స్థానం వెనకబడింది. ఎంత కష్టపడి చదువుతున్నా, శభాష్ అనిపించుకో లేకపోతున్నాను. దాంతో, చెవులు మరీ సొట్టలు పడిపోయినట్టుగా అనిపిస్తోంది!

సరిగ్గా అదే సమయంలో, సినీ తారల అందం మెరుగు పరుచుకోడానికి, ముక్కుకి, చెవులకీ, వగైరాలకి శస్త్ర చికిత్స చేస్తారని పత్రికల్లో చదివాను. వెంఠనే ప్రాణం లేచి వచ్చింది. ఎలాగైతేనే ఒక రోజు ధైర్యం చేసి, భోజనాల సమయంలో "నా చెవులకి సొట్టలు పోగొట్టే శస్త్ర చికిత్స చేయించండీ" అని మా నాన్న గారిని అడిగేశాను. వెంఠనే మా అన్నయ్య ఒకడు భళ్ళుమని నవ్వాడు. నాకు వొళ్ళు మండింది. ఏం చేస్తాం, నోరు మూసుకుని, తీర్పు ఏం వొస్తుందో అని ఎదురు చూడడం తప్ప! మా నాన్న గారు నన్ను ఎగాదిగా చూసి, "ఏడవలేక పోయావు! నీ బోడి అందానికి ఇప్పుడేం తక్కువైపోలేదు. మీ బాబాయ్, ఫలానా ఆయన లేడూ, వాడి చెవి అయితే, సగానికి సగం కొరికేసినట్టుంటుంది. నిక్షేపంలా, కళాశాలలో బోధకుడిగా పని చేస్తున్నాడు. నీలాగ ఎప్పుడూ నీలగ లేదు! ఆ ఏడుపేదో చదువులో ఏడు, మీ అన్నయ్యల కాలి గోటి దగ్గరకి కూడా రావట్లేదు. ఇలా అయితే, ఏదో తాలూకా కార్యాలయంలో గుమాస్తాగిరీ వెలగబెట్టవలసిందే" అని, చెయ్యి కడుక్కుని వెళ్ళి పోయారు. మా అమ్మ గారు మాత్రం "ఏం పరవాలేదు నాన్నా, నిక్షేపంలా ఉన్నావు. మా బంగారు కొండ కదూ, ఏదో ఒక చెవి కొంచెం తేడాగా ఉందంతే! కాకపోతే, కర్ణుడి లాగ కుండలాలతో పుట్టే వాళ్ళు ఎంత మంది ఉంటారు?" నువ్వు చాలా అదృష్టవంతుడివని, నీ జాతకం చూసిన సిద్ధాంతి గారు చెప్పారుగా. నువ్వు పుట్టగానే తాత గారు చూసి, "అమ్మాయ్ వీడు చాలా చమత్కారి అవుతాడు" అన్నారు" అని చాలా కబుర్లు చెబుతూ, వేడి వేడిగా పాలకోవా చేసి, ఒక అరిటాకు ముక్కలో వేసిచ్చారు. దాంతో కాస్త కుదుటపడి, చదువుతో కుస్తీ మొదలెట్టాను. పెద్దగా ప్రయోజనం కనబడట్లేదు. ఇలాగైతే నేను కూడా, తాత గారి లాగ పెద్ద వైద్యుణ్ణయ్యేది ఎలాగ అని ఆలోచిస్తూ ఉండే వాడిని.

ఈ పాటికి ఈ చెవి పురాణం విని మీకు విసుగు వస్తో ఉండి ఉండాలి. మరేం మొహమాట పడకండి, నాకు కూడా పోని సొట్టలు, రాని మార్కులూ చూసి, చూసి మీలాగే విసుగు చెందే సమయానికి ఒక గమ్మత్తు జరిగింది! ఏడవ తరగతిలో సామాన్య శాస్త్రం బోధించడానికి, కొత్త ఉపాధ్యాయులు శ్రీ వంకా రామకృష్ణ శాస్త్రి గారు వచ్చి, పాఠ్యాంశాన్ని నల్ల బల్లపై చక్కని బొమ్మలు గీసి మరీ వివరించారు. అంత వరకూ ఆ విధంగా పాఠం చెప్పిన వారు లేరు! ఆయన గంభీరమైన కంఠ స్వరం, చెప్పే తీరులో స్పష్టత నన్ను ఎంతో ఉత్తేజ పరిచాయి. బుర్రలో ఏదో ఒక మెరుపు మెరిసినట్టయ్యింది! ఇంటికి వెళ్ళి, తదేక దీక్షతో చదవడం మొదలు పెట్టాను. మొత్తం జీవశాస్త్రం పుస్తకం నాలుగు రోజుల్లో చదివేశాను. ఒక రోజు పాఠంలో అంశం, వృక్షాలకు శాస్త్రీయ నామాలు ఎందుకుండాలి అని. శాస్త్రి గారు, అంశం పేరు చెప్పి, "ఏరా, ఎవరికైనా తెలుసా? తెలిస్తే చెయ్యి ఎత్తండి" అన్నారు. కొమ్ములు తిరిగిన వాళ్ళెవరూ చెయ్యెత్తలేదు. నేను చెయ్యెత్తేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. నేను వెంఠనే లేచి, మాస్టారు ఎంత స్పష్టంగా చెబుతారో అంత చక్కగా, పాఠ్య పుస్తకంలో చదివినదంతా కూలంకషంగా వివరించాను. గురువుగారు చాలా సంతోషించి, శభాష్ అన్నారు. ఆ రోజు నుండి నాకు సామాన్య శాస్త్రంలో, తొంభై తొమ్మిది శాతం కంటె తక్కువ రాలేదు. ఆ రోజు నుండి నా చెవులు కూడా

నన్నెప్పుడూ బాధ పెట్టలేదు! ఆ తరవాత ఎవరైనా వాటి గురించి అడిగేవారో లేదో కూడా నాకు గుర్తు లేదు. అంత చిన్నతనంలో అంత క్షోభకు గురైన నా కష్టాలన్నీ పటాపంచలు చేసిన, తేజోవిరాజితులైన మా గురువు గారు, వారి వృత్తికి పూర్తి న్యాయం చేశారని నమ్ముతాను. వారికి కడవరకూ కృజ్ఞుడనై ఉంటాను.

అపుడే నాకర్థమైంది, చెవులెంత వంకరగా ఉన్నాయి అన్నది కాదు ముఖ్యం, ఆ చెవులెంత తిన్నగా వింటున్నాయి, ఆ విన్న విషయాలు మనపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయి అన్నది ముఖ్యమని. అపుడే మా బాబాయ్ గారు, సగం చెవి కొరికేసినట్టున్నా, ఏవీఁ ఇబ్బంది పడకుండా హాయిగా ఎలా ఉంటున్నారో కూడా అర్థం అయ్యింది. ఇది చదివిన మీకు నా నిజాయితీ మీద నిజంగా సందేహం రాలేదంటే, నాకు సందేహమే! ఆ రోజు నుండీ చెవులు బాధ పెట్ట లేదు, అస్సలు గుర్తే లేదు అన్న పెద్ద మనిషి, మనందరి దగ్గిరా, ఇంత కూలంకషంగా ఎలా భోరుమంటున్నాడనేగా, మీ సందేహం! చూశారా మరి, అలా తొందర పడి మీలో మీరే ఏదో అనేసుకుంటోంటే మరి నేను నొచ్చుకోనూ! పర్లేదు లెండి, మీ మంచి కోరేవాణ్ణి కాబట్టి అలా ఏవీఁ అనుకోను. అదిగో, అక్కడికే వస్తున్నాను.

కొద్ది నెలల కిందట, చెవి మీద ఒక పొక్కు లేచి, పుండులా మారింది. మానడం, మళ్ళీ రావడం. పక్కకు తిరిగి పడుకుంటే విపరీతమైన నెప్పి. సరే అని, మా కుటుంబ వైద్యులను సంప్రదిస్తే, వారు "ఇది కొంచెం అనుమానాస్పదంగా ఉంది. చర్మానికి సంబంధించిన క్యాన్సర్ ఏమో అన్న అనుమానం నివృత్తి చేసుకోవాలి. నిన్ను వెంఠనే చర్మ వైద్యుల వద్దకు పంపుతాను" అన్నారు. చర్మ వైద్యులమ్మ గారు పరిశీలించి, "ఇది, కొంప తీసి అది కాదుకదా? అదే ఒక వేళ ఇది అయినట్లయితే కనుక చాలా ఇదైపోతుంది. ఆ తరవాత ఎంత ఇదయినా, అదేం అవ్వదు. అందు వలన మనం, దీనికి మత్తిచ్చి, కొంత ముక్క తీసి, పరీక్షకి పంపాలి" అన్నారు. తరువాత కొన్ని రోజులకు, అన్నంత పనీ చేశారు. పుండులో చిన్న ముక్కేం ఖర్మ, చెవిలో చిన్న ముక్కే కత్తిరించి పారేశారు! అంటే, నా ఉద్దేశం పారేశారని కాదు, సాధారణంగా అలా అంటుంటాం కదా! అపుడు, పరిక్ష కోసం సీసాలో వేసిన నా చిన్ని చెవి ముక్క వైపు తిరిగి, "ఇకపై ఎవరైనా ఎండలో బైటకు వెళ్ళే సమయంలో, రక్షణ లేపనాలు పూసుకుంటుంటే వారిని చూసి నవ్వుకోనని, నేను కూడా అటువంటి సందర్భాలలో, ఎండ బారి నుండి చర్మాన్ని రక్షించుకుంటానని, అతి నీల లోహిత కిరణాల వల్ల చర్మానికి క్యాన్సర్ వ్యాధి వస్తుందని తెలసీ అశ్రద్ధ చేయడం పొరబాటేనని" విన్నవించుకుంటూ, శ్రద్ధాంజలి ఘటించాను. మూడు కుట్లు కూడా పడ్డాయి. అ కుట్లు ఎలా మానుతున్నాయి అని రోజూ అద్దంలో చూసుకునే క్రమంలో హటాత్తుగా, కొన్ని దశాబ్దాల క్రిందట జరిగి, నేను పూర్తిగా మరచి పోయిన సంఘటనలన్నీ గుర్తుకు వచ్చాయి, అవి అల్లాగే మీతో పంచుకుంటున్నాను, అంతే!

ఇప్పుడు నేను, అసలు మీరెవరూ తెలీక పోయినా, నా సంగతులు అన్నీ ఎందుకు చెబుతున్నాను? తెలిసీ తెలియని పసి హృదయాలపై, మనం అనాలోచితంగా అనే మాటలూ, చేసే పనులూ ఎటువంటి ప్రభావం చూపుతాయో కదా! నా అదృష్టం వల్ల, నా గురువు అనుగ్రహం వల్ల, అటువంటి మాటలు నాపై దుష్ప్రభావం చూపినా, దాని బారి నుండి

బయట పడ్డమే కాకుండా, జీవితంలో విజయం సాధించాలంటే ఏది ముఖ్యం? దేనిని లెక్క చేయ కూడదు? అన్న జ్ఞానం, విచక్షణ నాకు పన్నెండేళ్ళ వయస్సు లోనే వచ్చాయి. అందరూ అంత అదృష్టవంతులు ఉండరేమో, మన విచక్షణతో వారికి సహాయ పడగలమేమో అనిపిస్తోంది. హాస్యం పేరిట, రంగు, రూపు రేఖలను, అంగ వైకల్యాలనూ, గేలి చెయ్యడం అనే క్రూర ప్రవర్తన నుండి నా సమాజాన్ని దూరం చేయమని, నేను ఆ సృష్టి కర్తను వేడుకుంటే, మీరూ నాతో గొంతు కలుపుతారుగా!

అది సరే, “పాపం కత్తిరించిన చెవి ఎల్లా ఉంది? ఇదివరకటి సొట్ట చెవుల కన్నా అన్యాయంగా లేదు కద”అంటారా! చెప్పాను కదండీ, చెవులు సొట్టగా ఉన్నాయా? దిట్టగా ఉన్నాయా? అని పట్టించుకోవడం మానేసి చాలా కాలం అయ్యిందని! కానీ మీరందరూ, నా కష్టాలకి గుడ్లమ్మట నీళ్లు పెట్టుకుని ఉండుంటారు కాబట్టి, నేను చెప్పేదేవిఁటంటే, కడపటి వార్తలందేసరికి నా చెవి ముక్క పరిక్ష ముగిసి, నివేదిక వచ్చింది. మొత్తం మీద క్యాన్సర్ లేదని తేల్చారు. అదేవిఁటో “ఖాంఢ్రోడెర్మటైటిస్ నాడ్యులారిస్ హెలిసిస్” అట! మీరు వెంఠనే గూగుల్ శోధన చేసేస్తారు కాబట్టి నేను వివరించే శ్రమ తీసుకోను. అదేవిఁటో, నాలోని కర్ణుడూ, అర్జునుడూ కూడా క్యాన్సరు భయంతో నా నుండి దూరం కావడం ఆశ్చర్యంగా లేదూ! మొత్తం మీద, నెమ్మదిగా, నేనూ మామూలు మనిషిననే నమ్మకం కుదురుతోంది!

కాకపోతే, మీరేమీ అనుకోనంటే ఒక సందేహం! నాలో కర్ణుడూ, అర్జునుడూ, ఇద్దరూ ఉన్నారంటారా? లేక పోతే, వీపు మీద పెద్ద పుట్టు మచ్చ, కర్ణుడి కవచంలో భాగవేఁ అంటారా!

COMMENTS